క్లుప్తంగా

వైభవంగా సీతారాముల కల్యాణం



వాల్మీకిపురం: స్థానిక పట్టాభిరామాలయంలో శనివారం శ్రీరాముడి జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి సేవా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం స్వామి వారికి అర్చన, అభిషేకం, తోమాలసేవ తదితర కార్యక్రమాల అనంతరం విశేష అలంకరణలో ముస్తాబైన ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన మండపంలో సంప్రదాయ బద్ధంగా తీసుకెళ్లి ఆశీనులను చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు.

వేలంలో రూ.81వేల ఆదాయం

నిమ్మనపల్లె : స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద శనివారం నిర్వహించిన వేలంలో ఆటో అమ్మకం ద్వారా రూ.81,184 ఆదాయం సమకూరినట్లు ఎస్ఐ ఫాతిమా తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో వేలం నిర్వహించగా, తవళం గ్రామానికి చెందిన సయ్యద్ మస్తాన్ రూ.68,800 వేలంలో వాహనాన్ని దక్కించుకున్నట్లు తెలిపారు.

కాపు యువసేన జిల్లా అధ్యక్షుడిగా విద్యాసాగర్



మదనపల్లె : జిల్లా కాపుయువసేన అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పూల విద్యాసాగర్‌ను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్ణాశ్రీనివాసరావు శనివారం నియామకపత్రం అందజేశారు. జిల్లా పరిధిలోని కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపాలని సూచించారు. మూడేళ్లపాటు విద్యాసాగర్ జిల్లా అధ్యక్ష పదవిలో కొనసాగుతారని పేర్కొన్నారు.

దళితుల్ని అవమానించే వారిపై చర్యలు తీసుకోవాలి

కేవీపల్లె : దళితున్ని అవమానించేవారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ కోరారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కేవీపల్లె మండలంలో తిమ్మాపురంలో దళిత మహిళలకు రావాల్సిన ప్రభుత్వ పథకాలు, రుణాలు అందకుండా ఓ సంఘమిత్ర, వెలుగుసీసీ లేనిపోని కారణాలు చూపుతూ అడ్డు పడుతున్నారని ఆరోపించారు. దళిత మహిళల మనోభావాలు దెబ్బతినే విధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు.

ఇసుక పర్మిట్లు తప్పనిసరి

కేవీపల్లె : మండలంలోని జగనన్న కాలనీకు, నాడు–నేడు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు సంబంధించి ఆయా శాఖల ద్వారా ఇసుక పర్మిట్లు తప్పనిసరిగా తీసుకోవాలని తహసీల్దార్ ప్రేమంత్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయం మేరకు ఇసుక కావాల్సిన ప్రజలు, కాంట్రాక్టర్లు సంబంధిత శాఖ అధికారులను సంప్రదించి పర్మిట్లు పొందాలన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఇసుక కోసం ఎటువంటి అనుమతి ఇవ్వబడదని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బి.కొత్తకోట: స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శనివారం తహసీల్దార్ ధనుంజయలు, ఎంపీడీఓ శంకరయ్య, ఎంఈవో రెడ్డిశేఖర్ పరిశీలించారు. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల కోసం హైస్కూల్‌లో గ్రాడ్యుయేట్ నియోజకవర్గానికి 104, 107 పోలింగ్ కేంద్రాలు, టీచర్స్ నియోజకవర్గానికి 102 పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల భవనాలు, సౌకర్యాలను పరిశీలించారు.

మల్లయ్యకొండకు గోదానం

తంబళ్లపల్లె: మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయానికి భక్తుడు గోదానం చేశారు. శనివారం బాలిరెడ్డిగారిపల్లె పంచాయతీ దిగువపల్లెకు చెందిన జి.సాంబశివారెడ్డి 2 దేశవాళి ఆవులను దానంగా ఇచ్చారు. ఆ గోవులను మల్లయ్యకొండకు తీసుకెళ్లి పూజారి ఈశ్వరప్పకు అప్పగించారు. ఆయన దాతృత్వాన్ని ఆలయ కమిటీ చైర్మన్ కెఆర్ మల్లిరెడ్డి, ఈవో రమణ, కొండకిట్టా , భక్తులు ప్రశంసించారు.

సమన్వయంతో కృషి చేస్తేనే సత్ఫలితాలు

తంబళ్లపల్లె: మండలంలో గ్రామ సచివాలయ ఉద్యోగులు, ఎన్ఆర్ఈజీఎస్, హౌసింగ్ అధికారులు సమన్వయంతో కృషి చేసినప్పుడే జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణ పనుల్లో సత్ఫలితాలు వస్తాయని డీఎల్‌డీవో లక్ష్మీపతి తెలిపారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామ వలంటీర్ల సహకారంతో ఇంటి పునాది పనులు పూర్తికాగానే సంబంధిత ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, హౌసింగ్ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కొలతలు తీసి వారికి సకాలంలో బిల్లులు చెల్లించేలా చొరవ చూపాలన్నారు.

జగనన్న పాలనలో ప్రతి ఇంటా సంతోషం

- ప్రభుత్వ పథకాలన్నీ అందుతున్నాయి
- జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలి
- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



ప్రజల సమస్యలు తెలుసుకొంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

గుర్రంకొండ: జగనన్న పాలనలో ప్రతి ఇంటా సంతోషం వెల్లివిస్తోందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని తరిగొండ గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పథకాలన్నీ అందుతున్నాయని ప్రజలు ఎమ్మెల్యే ఎదుట చెప్పారు. జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. ప్రజల సమస్యలను తెలుసుకొంటూ పరిష్కారానికి అప్పటికప్పుడే అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలనీ అందిస్తున్నామన్నారు. సచివాలయల్లో ప్రజల నుంచి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే బాధ్యత సచివాలయ ఉద్యోగులపై ఉందన్నారు. కృష్ణారెడ్డి వీధిలో వైఎస్సార్ ఇళ్లు మంజూరు చేయాలని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ కాలనీలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, చాలా రోజులుగా వెలగడం లేదని ఎమ్మెల్యే దృష్టికి ప్రజలు తీసుకొచ్చారు. వెంటనే వీధిదీపాలు ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. గ్రామంలో సిమెంటు రొడ్లు, మురుగునీటి కాలువలు నిర్మించాలని మహిళలు కోరారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లాల్‌స్వామిని ఆదేశించారు. మర్రిపాడు పంచాయతీ ఉసిరికాయలపల్లెలో దారి సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. వెంటనే వెళ్లి సమస్య పరిష్కరించాలని తహసీల్దార్‌కు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రవినాయక్, జెడ్పీటీసీ సమ్రీన్ ముక్తియార్, మండల ప్రత్యేక ఆహ్వానితులు కందుల గుణశేఖర్, అప్పల్ల, ఎల్వీరమణ, సింగిల్‌విండో డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, సర్పంచ్‌లు వెంకట్రమణమ్మ, విశ్వనాథ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురేష్, నక్కా మధులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు
– ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. పట్టణంలోని 33వవార్డు నీరుగట్టువారిపల్లె మాయాబజార్ ప్రాంతంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్ నూర్‌ఆజం, కౌన్సిలర్ ఎం.వి.రమణ, కమిషనర్ కే.ప్రమీల, సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వం తరపున తమకు అందుతున్న సంక్షేమ పథకాలపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. వృద్ధులను ఆప్యాయంగా పలుకరించిన ఎమ్మెల్యే పింఛన్లు ప్రతినెలా సక్రమంగా అందుతున్నాయా ? లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందకపోతే వలంటీర్ల ద్వారా సచివాలయంలో సంప్రదించాలన్నారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించి వెంటనే వారికి పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందిని, అధికారులను ఆదేశించారు. గతంలో సిఫార్సులు ఉంటేనే పథకాలు వచ్చేవని, జగనన్న ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు ఇళ్లవద్దకే వస్తాయన్నారు. ప్రతినెలా ఠంచనుగా పెన్షన్ వేకువజాములోనే ఇళ్ల వద్దకు అందజేయడమే అందుకు ఉదాహరణ అన్నారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా సాగుతున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మేస్త్రీశ్రీనివాసులు, ఆర్.వి.శివారెడ్డి, ఎస్వీ.రమణ, రామిశెట్టిశివయ్య, ఎస్.కరీముల్లా, వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరురఫీ, బాలగంగాధరరెడ్డి, శీలంరమేష్, దండు రామాంజులు, చందూరెడ్డి, ఎల్ఐసీ.సుధాకర్, వైస్ ఎంపీపీ నందినితాజ్, కోఆప్షన్ శారదారెడ్డి, జాన్ బాబు, రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

11న జాతీయలోక్ అదాలత్

తంబళ్లపల్లె: స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో ఈ నెల 11వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాసంఘం అధ్యక్షులు, స్థానిక న్యాయమూర్తి హసీఫాసుల్తాన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, క్రిమినల్, కాంపౌండబుల్, బ్యాంకు రికవరీ తదితర కేసులను రాజీమార్గంలో పరిష్కరించబడుతాయన్నారు. కక్షిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోర్టులో పరిష్కారమైన కేసులకు సంబంధించి కక్షిదారులకు ఫీజు వెనక్కి ఇవ్వబడుతుందన్నారు. అపీల్‌కు వీలుండదన్నారు. లోక్ అదాలత్ బెంచ్ జారీ చేసిన తీర్పే తుదితీర్పన్నారు.

కబడ్డీ టోర్నీ విజయవంతం చేయండి

పీలేరు రూరల్ : ఈ నెల 6, 7వ తేదీల్లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించనున్న మోదీ కబడ్డీ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని బీజీ జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం మోదీ కబడ్డీ టోర్నమెంట్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుభాష్ చంద్రబోష్ జయంతిని పురస్కరించుకుని బీజేవైఎం ఆధ్వర్యంలోకబడ్డీ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ. 15 వేలు, రెండవ బహుమతి రూ. 10 వేలు, మూడో బహుమతి రూ.5 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు 9908816163, 9440202341 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

చైతన్యం ద్వారానే వేధింపులను అరికట్టవచ్చు

–ఆర్డీఓ ఎం.ఎస్.మురళి



మాట్లాడుతున్న ఆర్డీఓ మురళి

మదనపల్లె సిటీ: బాలికల్లో చైతన్యం కల్పించడం ద్వారానే వారి పట్ల జరిగే వేధింపులను అరికట్టవచ్చునని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ పాఠశాలల్లో బాలికలకు తమకు ఎలాంటి లైగింక వేధింపులు, ఇతర సమస్యలు ఎదురైతే చైల్డ్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. బాలికలపై లైంగిక వేధింపుల నివారణకు అన్ని పాఠశాలల్లో ఫిర్యాదుల పెట్టెలను అమర్చినట్లు తెలిపారు. సీడీపీఓ సుజాత మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు ఇవ్వజూపే విలువైన వస్తువులు, ఆహార పదార్థాలు, ఆట వస్తువులు తీసుకోకూడదన్నారు. ఇలాంటి చర్యలను నిర్మోహమాటంగా వద్దని చెప్పాలన్నారు. బాలలు తమకు కలిగిన అసౌకర్యాన్ని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు దృష్టికి తీసుకురావాలన్నారు. ఎవరైతే అసభ్యకరంగా తాకితే అది తమ తప్పు కాదని బాలికలు గుర్తించాలన్నారు. అంతే తప్ప ఆత్మనూన్యతకు గురి కాకూడదన్నారు. కార్యక్రమంలో డీవైఈఓ క్రిష్ణప్ప, ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, హెచ్ఎం రెడ్డన్నశెట్టి, రేవతి ఫౌండేషన్ వ్యవస్థాకులు రామమూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

–ఉన్నత విద్యాశాఖ ఆర్‌జేడీ డాక్టర్ బాబు



మాట్లాడుతున్న ఆర్‌జేడీ బాబు

మదనపల్లె సిటీ: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని ఆర్‌జేడీ డాక్టర్ బాబు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరుచుకొని లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. కష్టపడి చదివితే ఫలితం వస్తుందన్నారు. విద్యార్థి దశ ఎంతో ముఖ్యమైనదని తెలిపారు. ప్రభుత్వం ఉన్నత విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలన్నారు. అధ్యాపకులు కూడా మారుతున్న కాలానుగుణంగా భోదన చేయాలన్నారు. కళాశాలల్లో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిగ్రీ తరువాత వివిధ పోటీ పరీక్షలు, ఉద్యోగ అవకాశాల గురించి చర్చించారు. గిన్నీస్ రికార్డు వక్త మేజారి మల్లికార్జున విద్యార్థులకు పలు విషయాలపై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి, అధ్యాపకులు మోహన్‌వల్లి, గురుమూర్తి, జ్యోతి, శ్రీనివాసులు, హాజీరాఖానం, వెంకటశివ తదితరులు పాల్గొన్నారు.

భారీగా కర్ణాటక మద్యం ధ్వంసం



మద్యాన్ని ధ్వంసం చేస్తున్న ఎస్ఈబీ అధికారులు

మదనపల్లె : మదనపల్లె ఎస్ఈబీ పరిధిలో 2020 నుంచి 2022 వరకు మూడేళ్లపాటు 69 కేసుల్లో సీజ్‌చేసిన 12,252 బాటిల్స్, టెట్రాప్యాకెట్లు నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్(ఎన్‌డీఎల్) కర్ణాటక మద్యాన్ని శనివారం ధ్వంసం చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ మధుసూధన్ తెలిపారు. దీనివిలువల బహిరంగ మార్కెట్లో రూ.12,25,200 ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడేళ్లుగా వివిధ కేసుల్లో సీజ్ చేసిన ఎన్‌డీపీఎల్ మద్యంకు సంబంధించి అనంతపురం డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రభుత్వానికి జప్తు చేసి ధ్వంసం ఉత్తర్వులు పొందామన్నారు. తదుపరి అన్నమయ్య జిల్లా ఏఎస్పీ రాజ్‌కమల్, డిప్యూటీ కమిషనర్ ఉత్తర్వుల మేరకు చిప్పిలి సమీపంలోని విజయాడెయిరీ వెనుక మధ్యవర్తుల సమక్షంలో మద్యం ధ్వంసం చేశామన్నారు. కార్యక్రమంలో ఏఈఎస్ రాధాకృష్ణ, సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ అంజాద్‌బాషా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కె.బాటవారిపల్లెలో తీరిన నీటి సమస్య



కె.బాటవారిపల్లెలో పైప్‌లైన్ పనులు చేయిస్తున్న ఎంపీపీ శ్రీదేవి, ఎంపీడీఓ నారాయణ

కలకడ : రెండు కుటుంబాలకే మంచినీరు అనే వార్త సాక్షిలో ప్రచురితం కావడంపై శనివారం ఎంపీపీ శ్రీదేవి, ఎంపీడీఓ నారాయణ స్పందించారు. మండలంలోని కె.బాటవారిపల్లె గ్రామంలో ప్రభుత్వ స్కీంబోర్ నీరు అందరికీ అందడం లేదని, కేవలం రెండు కుటుంబాలకే అక్రమంగా నీరు వెళుతున్నట్లు గ్రామస్తుల సమాచారంతో సాక్షిలో వార్త ప్రచురితం కావడం, సమస్యను ఎంపీపీ దృష్టికి గ్రామస్తులు తీసుకురావడంతో స్పందించారు. శనివారం పంచాయతీ కార్యదర్శి నందిని గేట్‌వాల్వ్‌లు, పైప్‌లైన్ ఏర్పాటు చేయించి గ్రామంలోని అన్ని కుటుంబాలకు సమానంగా మంచినీరు అందించే ఏర్పాటు చేసినట్లు చేశారు.

కేన్సర్ నివారణపై అవగాహన తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి మానస

వాల్మీకిపురం: తొలిదశలో కేన్సర్ వ్యాధిని గుర్తిస్తే దాని నివారణ మార్గం సులభమని మండల వైద్యాధికారి మానస అన్నారు. శనివారం మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీ ఆసుపత్రి ఆవరణంలో కేన్సర్ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేన్సర్ వ్యాధి లక్షణాలు ఉంటే తక్షణమే సమీప ఆసుపత్రిలో వైద్యులకు చూపించాలన్నారు. ప్రతి ఏడుగురిలో ఒకరికి కేన్సర్ వ్యాధి ఉండవచ్చునన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, సిహెచ్‌వో ఇందిరారాణి, సూపర్‌వైజర్లు సుధాకర్, పూర్ణమ్మ, వలిసాహెబ్, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

కేన్సర్‌పై నిర్లక్ష్యం వద్దు

పీలేరు : శరీరంలోని ఏ భాగానికైనా, ఎవరికైనా కేన్సర్ రావచ్చు. నిర్లక్ష్య వహించరాదని డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్ అన్నారు. శనివారం మేళ్లచెరువులో జెడ్పీ ఉన్నత పాఠశాలలో కేన్సర్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులచే మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేన్సర్ రావడానికి దోహదం చేసే అంశాలపై అవగాహన లోపమే ప్రధాన కారణమని తెలిపారు. మేలైన జీవన శైలి తోపాటు ఆహార నియమాల్లో మెరుగైన మార్పులు అవసరని చెప్పారు. శరీరంలో కణతులు, మూత్ర విసర్జనలో మార్పులు, తగ్గని దగ్గు, అజీర్ణం లాంటి లక్షణాలు ఉంటే ప్రభుత్వాస్పత్రిలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఈ కొండయ్య, హెచ్ఎం సురేంద్ర, పీహెచ్ఎస్ వెంకటసుబ్బమ్మ, ఏఎన్ఎం నాగవేణి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీటీఎం జాతరకు పటిష్ట బందోబస్తు

మదనపల్లె : సీటీఎం శ్రీ నలవీర గంగాభవాని జాతరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని సీటీఎంలో నలవీర గంగాభవాని జాతర ఈనెల 7,8 తేదీల్లో జరుగనున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇద్దరు డీఎస్పీలు, నలుగురు సీఐలు, పదిమంది ఎస్ఐలు, 25 మంది హెడ్‌కానిస్టేబుల్‌లు, 149 మంది పోలీస్ కానిస్టేబుల్, 10 మంది మహిళా పోలీసులు, 30 మంది హోంగార్డులు, 20 మంది స్పెషల్ పార్టీ పోలీసులతో జాతర బందోబస్తు నిర్వహిస్తామన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. చాందినీ బండ్ల వద్ద ఎలాంటి రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహించరాదని హెచ్చరించారు. అతిగా మద్యం సేవించి గొడవలకు పాల్పడితే అరెస్ట్ చేస్తామన్నారు. జాతర పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్, 30 పోలీస్‌యాక్ట్ అమల్లో ఉంటుందన్నారు. జాతర సందర్భంగా పలు గ్రామాల్లో ఏర్పాటు చేసుకునే చాందినీ బండ్లు ఎట్టి పరిస్థితుల్లోనూ 13 అడుగులకు మించి ఎత్తుగా ఏర్పాటు చేయవద్దని సీఐ తెలిపారు.

గ్యాస్ వినియోగంపై అవగాహన



గ్యాస్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గుర్రంకొండ: గ్యాస్ వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని కడప ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ఎస్‌ఓ ప్రవీణ్ అన్నారు. శనివారం స్థానిక తెలుగు జెడ్పీహైస్కూల్లో స్థానిక అమీర్ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ వారు గ్యాస్ వాడకం– భద్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్యాస్ సిలిండర్‌ను ఏ విధంగా వినియోగించుకోవాలి, భద్రత సూచనలను ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ వినియోగంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకుముందుగా గ్యాస్‌ను సెల్‌ఫోన్‌లో ఏజెన్సీకి కాల్ చేసి బుక్ చేసుకోవాలన్నారు. సిలిండర్ వినియోగంపై ఎటువంటి అనుమానాలున్నా స్థానిక ఏజెన్సీ వారికి సమాచారం అందిస్తే నివృత్తి చేస్తారన్నారు. కార్యక్రమంలో ఇండియన్ గ్యాస్ యాజమాన్యం, సిబ్బంది, హెడ్మాస్టర్ మదన్‌మోహన్, పీడీ రమేష్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం



బహుమతులు ప్రదానం చేస్తున్న దాత

ములకలచెరువు: ములకలచెరువు ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించి నగదు బహుమతులు అందజేశారు. స్థానిక మండల కేంద్రానికి చెందిన ఆర్టీసీ బస్సు కండెక్టర్ శ్రీధర్ తన తల్లిదండ్రులు తోట దామోదర్, లక్ష్మీదేవమ్మల జ్ఞాపకార్థం పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు రూ.30 వేల నగదు బహుమతులు అందించారు.

కుష్టు నివారణపై అవగాహన

పెద్దతిప్పసముద్రం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది శనివారం మండలంలోని మద్దయ్యగారిపల్లి, పులగంటివారిపల్లి ప్రాథమిక పాఠశాలల్లో కుష్టు నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు ఉంటే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించి డాక్టర్ల సూచనల మేరకు మందులు వాడితే ఆరంభంలోనే వాటిని అరికట్టవచ్చన్నారు. సర్పంచ్ రామాంజులు, ఎంపీటీసీ షేక్ ప్యారీజాన్ , వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజ స్థాపనే లక్ష్యం

వాల్మీకిపురం: డ్రగ్స్ రహిత సమాజ స్థాపనే లక్ష్యమని వాల్మీకిపురం ఎస్ఐ బిందుమాధవి అన్నారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా శనివారం పట్టణంలో పోలీసులు, యువత సంయుక్తంగా ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్‌తో జీవితాలను నాశనం చేసుకోవద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గంజాయి, కొకైన్, హెరాయిన్ తదితర డ్రగ్స్ జీవితాలను నాశనం చేస్తాయన్నారు. పొరపాటున యువత ఇలాంటి వాటికి అలవాటు పడితే వ్యసనపరులుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటారన్నారు. డ్రగ్స్‌ను వినియోగిస్తే ఆరు నెలలు జైలు శిక్ష పడుతుందన్నారు. డ్రగ్స్‌ను కలిగి ఉండడం, వాటిని అమ్మినా 10 నుంచి 20 సంవత్సరాలు జైలు శిక్ష పడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ లీలావతి, సిబ్బంది పీజె ఖాన్, చంద్రశేఖర్ నాయక్ పాల్గొన్నారు.

కమనీయం..జనార్దనస్వామి కల్యాణం

రామసముద్రం: మండల కేంద్రంలో వెలసిన శ్రీలక్ష్మీజనార్దన స్వామి బ్రహ్మరథోత్సవంలో భాగంగా శనివారం శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామికి వైభవంగా కల్యాణోత్సవం , పూలంగిసేవ నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు , కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారధి భట్టర్, కులశేఖర్ భట్టర్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పౌరాణిక నాటకం నిర్వహించారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

నిమ్మనపల్లె : మండల కేంద్రమైన నిమ్మనపల్లెలోని ఎరువుల దుకాణాల్లో శనివారం వ్యవసాయశాఖ భూసార అడిషనల్ డైరెక్టర్ దీక్షాకుమారి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లోని ఎరువులను, రికార్డులను పరిశీలించారు. తూనిక కొలతలను తనిఖీ చేశారు. వ్యవసాయ పంటల పిచికారీ మందులను పరిశీలించారు. శ్యాంపిల్స్‌ను సేకరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్, సచివాలయ వీపీఈ పాల్గొన్నారు.

జాబ్‌మేళాను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ మురళీమోహన్‌రెడ్డి

పీలేరు రూరల్ : మదనపల్లె బీటీ కళాశాలలో ఈ నెల 10న నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను విజయవంతం చేయాలని ఎంపీపీ సతీష్‌రెడ్డి, ఎంపీడీఓ మురళీమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాకు వివిధ రాష్ట్రాల నుంచి 125 కంపెనీలు వస్తున్నట్లు తెలిపారు. పదవ తరగతి ఆపై విద్యార్హతగల నిరుద్యోగ యువతీ యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9014528171, 9441776334 నెంబర్‌లను సంప్రదించాలని కోరారు.